ప్రణాళికతో పదిలం



హిందూపురం: చౌళూరు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

వచ్చే నెల నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే 'అనంత సంకల్పం' పేరుతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారిని అన్ని విధాలా పరీక్షలకు సన్నద్ధం చేస్తోంది. ముఖ్యంగా పది పరీక్షలు అంటేనే ఉన్న భయాన్ని పోగొట్టి మంచి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నారు.

- పక్కాగా 'అనంత' సంకల్పం
- ఎంతగానో ఉపయోగపడుతున్న ప్రత్యేక క్లాసులు
- పదో తరగతి విద్యార్థుల్లో భయం పోగొట్టేలా ఉపాధ్యాయుల శిక్షణ

నియోజకవర్గం	హిందూపురం
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	41
పదో తరగతి విద్యార్థుల సంఖ్య	2,910
నియోజకవర్గం	పెనుకొండ
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	83
పదో తరగతి విద్యార్థుల సంఖ్య	4,272
నియోజకవర్గం	మడకశిర
ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు	60
పదో తరగతి విద్యార్థుల సంఖ్య	2,700

హిందూపురం/పెనుకొండ/ మడకశిర రూరల్: పదిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ అధికారులు గత ఏడాది డిసెంబర్ 14 నుంచే 10వ తరగతి విద్యార్థులకు 'అనంత సంకల్పం' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. రోజూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు , సాయంత్రం 3.20 గంటల నుంచి 5 గంటల వరకు రోజూ సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. ఎప్పటికప్పుడు టెస్టులు నిర్వహించి టెస్ట్ పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు.

రోజు వారీగా పరీక్షలు

ఇంగ్లిష్, గణితం, సాంఘిక శాస్త్రం, సైన్స్ సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి వీలుగా పక్కా ప్రణాళిక రూపొందించి చదివిస్తున్నారు. ముఖ్యమైన ప్రశ్నలకు విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టి వారిని పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగానే రోజూ వారీగా పరీక్షలు నిర్వహిస్తూ మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేస్తున్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని తొలగించి అధిక మార్కులు ఎలా సాధించాలో వివరిస్తున్నాం. ఇంగ్లిష్, గణితం పాఠాలను సులువుగా అర్థం చేసుకోవడానికి టిప్స్ చెబుతున్నాం. అనంత సంకల్పం ప్రత్యేక బుక్‌లెట్ ద్వారా బోధిస్తూ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం.

– షరీఫ్, ఉపాధ్యాయుడు, హిందూపురం

రోజూ పర్యవేక్షిస్తున్నాం



'అనంత సంకల్పం' కార్యక్రమం ఎంతో గొప్పది. విద్యార్థులను సానబడుతూ వారిని ఉత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్ది 10 పరీక్షల్లో సులువుగా పాసయ్యే విధంగా శిక్షణ ఇస్తున్నాం. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమం పక్కాగా కొనసాగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కూడా బాగా కృషి చేస్తుండటం అభినందనీయం.

– రంగస్వామి, డీవైఈఓ, పెనుకొండ

టీచర్లు బాగా ప్రోత్సహిస్తున్నారు



పది పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి ప్రత్యేక తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రస్తుతం మంచి గ్రేడ్ సాధించాలంటే మార్కులు ఎక్కువగా తెచ్చుకోవాలి. దీంతో అన్ని సబ్జెక్టులపై దృష్టి పెట్టి ప్రాక్టీస్ చేస్తున్నాను. ఉపాధ్యాయులు మాకొచ్చిన డౌట్లను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ మంచి మార్కులు ఎలా పొందాలో బాగా చెబుతున్నారు.

– చైతన్యనాయక్, 10వ తరగతి విద్యార్థి, ఆమిదాలగొంది

ప్రత్యేక తరగతులతో మేలు



ప్రభుత్వం అందించిన అనంత సంకల్పం బుక్ ఎంతో బాగుంది. ముఖ్యంగా పదో తరగతిలో పాస్ కావాలనే తపన పడే విద్యార్థులందరికీ ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది. అలాగే ప్రత్యేక క్లాస్‌లో అన్ని సబెక్టుల్లో ముఖ్యమైనవి ప్రత్యేకంగా వివరించి వాటిపై పరీక్షలు కూడా పెడుతున్నారు. టీచర్లు అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారు.

– ముస్కాన్, పదో తరగతి విద్యార్థి, హిందూపురం

'అనంత సంకల్పం' ఓ వరం



అనంత సంకల్పం కార్యక్రమం పదో తరగతి విద్యార్థులకు ఒక వరం. ప్రతి రోజూ ఉదయం సాయంత్రం ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తుండటంతో మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఏర్పడింది. ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని మాకొస్తున్న అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. ప్రతిరోజూ పరీక్ష పెడుతుండటంతో పబ్లిక్ పరీక్షలంటే భయం పోయేలా చేస్తున్నారు.

– ఖైరూన్‌బీ, 10 తరగతి విద్యార్థిని, పెనుకొండ

క్లుప్తంగా

ప్రీకాట్ మిల్లులో వైద్యశిబిరం

పరిగి: మండలంలోని ప్రీకాట్ స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక మిల్లు ఆవరణంలో జరిగిన కార్యక్రమానికి తహసీల్దారు సౌజన్యలక్ష్మి, హిందూపురం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గైనకాలజిస్ట్ చందనరెడ్డి, గ్యాస్ట్రిక్ సర్జన్ సాధాన్‌రెడ్డి, పరిగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ స్వరూపరెడ్డి నేతృత్వంలో మొత్తం 160 మందికి క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా 16 మందికి స్వల్ప లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే గ్యాస్ట్రిక్ సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరామప్ప, ఎంపీటీసీ సభ్యులు చిక్కన్న, మారుతీరెడ్డి, నారాయణరెడ్డి, అంజి, మిల్లు హెచ్‌ఆర్ జగపతిరాజు పాల్గొన్నారు.

31 స్థానాల్లో పోటీ చేస్తాం

పావగడ: 'రాష్ట్ర వ్యాప్తంగా తమ కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ బలోపేత మవుతోంది. మొత్తం 31 విధాన సభ క్షేత్రాల్లో పోటీ చేస్తున్నాం. ఇప్పటికే 9 మంది అభ్యర్థులను ప్రకటించాం' అని ఆ పార్టీ వ్యవస్థాపకుడు గాలి జనార్ధనరెడ్డి అన్నారు. పావగడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తర కర్ణాటకలో తమ పార్టీ రోజురోజుకూ బలపడుతోందన్నారు. ఎక్కడికి వెళ్లినా నమ్మకం, విశ్వాసంతో జనం తమను స్వాగతిస్తున్నారన్నారు. మాజీ సీఎం యడ్యూరప్ప తనకు తండ్రితో సమాన మని, రాజకీయంగా ఆయన పేరును దురుపయోగం చేసుకోనన్నారు.

అగళిలో అగ్ని ప్రమాదం

మడకశిర: అగళిలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో బీజేపీ నాయకుడు దొడ్డ రంగేగౌడ్‌కు చెందిన చింత, వక్క చెట్లు పాక్షికంగా కాలిపోయాయి. చింత చెట్టు కింద కొంత మేరకు గడ్డి, కొబ్బరి, వక్కగరులు వేశారు. ప్రమాదవశాత్తూ నిప్పంటుకోవడంతో పక్కనే ఉన్న వక్క చెట్లతో పాటు చింత చెట్టు కూడా పాక్షికంగా కాలిపోయింది.

పరిపూర్ణానందస్వామి పూజలు



గణపతి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న పరిపూర్ణానందస్వామి

హిందూపురం: పట్టణంలోని త్యాగరాజనగర్‌లో ఉన్న ఉమానర్మదేశ్వరస్వామి శివాలయంలో ఆదివారం శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందస్వామిజీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామీజీతో ఆశీర్వాదం అందుకున్నారు.

అటవీ ప్రాంతాన్ని కాపాడుకుందాం

రొళ్ల: వేసవిని దృష్టిలో ఉంచుకొని అటవీ ప్రాంతంలోని గడ్డితో పాటు ఇతరాత్ర చెట్లు పూర్తిగా ఎండిపోయి ఆకులు రాలుతున్నాయి. కొందరు అదే పనిగా అటవీ ప్రాంతంలో నిప్పు పెడుతున్నారు. ఇది చట్టరీత్య నేరమని ప్రజలు ఈ విషయాన్ని గమనించి అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టకుండా చెట్లను కాపాడుకోవాలని ఇన్‌చార్జ్ అటవీశాఖ అధికారి కుళ్లాయప్ప పేర్కొన్నారు. రొళ్ల ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని రొళ్ల, మండలపల్లి బీట్ పరిధిలో అటవీ ప్రాంతం విస్తరించి ఉందన్నారు. అయితే రోజూ ఏదో ఒకచోట ఆకతాయిలు అడవికి నిప్పు పెడున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు కూడా గమనించి అటవీ ప్రాంతంలో నిప్పు పెట్టకుండా చూడాలన్నారు.


ఉత్సవ విగ్రహాల వితరణ



సీతారాముల ఉత్సవ విగ్రహాలను అందజేస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్, వైఎస్సార్‌సీపీ ముఖ్య నేత రాజారెడ్డి కుటుంబం ప్రత్యేకంగా తయారు చేయించిన సీతారాములు, ఆంజనేయుడు పంచలోహ విగ్రహాలను బయలు ఆంజనేయస్వామి దేవాలయానికి ఆదివారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆయల ప్రధాన అర్చకు శ్రీనివాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణ హితమే ధ్యేయం



సైకిల్‌యాత్ర చేస్తున్న ముంబయి వాసులు

సోమందేపల్లి: ముంబాయికి చెందిన ఏడుగురు పర్యావరణ ప్రేమికులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ కశ్మీర్ నుంచి కన్యాకుమారికి సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఆదివారం సాయంత్రం వారు సోమందేపల్లికు చేరుకున్నారు. ఈ సందర్భంగా యాత్ర మురాడే, దేశ్‌ముఖ్ మాట్లాడుతూ సైకిల్ వినియోగం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. ఫిబ్రవరి 5న కశ్మీర్‌లో తమ యాత్ర ప్రారంభం కాగా 3,500 కి.మీ. కొనసాగుతుందన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరుడు

అమరాపురం: మండలంలోని హేమావతి గ్రామంలో సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి ఉదయం సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. మడకశిర నియోజకవర్గం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాలైన బెంగళూరు, మైసూర్, తుమకూర్, హిరియూర్, మధుగిరి, శిర, చెలికెర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించారు.

హామీలు నెరవేర్చకపోతే రాజకీయాలకు గుడ్ బై

- కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ వ్యవస్థాపకుడు గాలి జనార్ధనరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కేఆర్పీపీ అధినేత గాలి జనార్ధనరెడ్డి

పావగడ: ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే రాజకీయాలకు శాశ్వతంగా గుడ్ బై చెబుతానని కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ వ్యవస్థాపకుడు గాలి జనార్ధనరెడ్డి అన్నారు. స్థానిక గురుభవన్ మైదానంలో ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ గెలిస్తే పావగడలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. గ్రామ పంచాయతీ కేంద్రాలలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి రైతుకు ఏడాదికి వ్యవసాయ ఖర్చులకు రూ.15 వేలు వారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తామన్నారు. పిల్లల చదువుకు తల్లులకు ప్రతి ఏడాది రూ.15 వేలు వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఒకప్పటి ఆంధ్ర సీఎం, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డిని గుర్తు చేసుకుంటూ ప్రతి తండ్రి తమ కూతుళ్ల పెళ్లిళ్లకు ఉద్యోగస్తులనే ఎంపిక చేసుకుంటున్నారని, అయితే రైతు కొడుకులను ఎంపిక చేసుకునే దిశగా రైతులను తీర్చిదిద్దాలని వైఎస్సార్ తనతో అన్నారన్నారు. తమ కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ అభ్యర్థి నేరళెకుంటె నాగేంద్రకుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు గాలి జనార్ధనరెడ్డి కేఆర్పీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎస్ఎస్‌కే రంగ మందిరంలో విద్యార్థుల పోటీ పరీక్షల సిద్ధతపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో కేఆర్పీపీ నాయకులు వళ్లూరు చెన్నకేశవరెడ్డి, ఎస్ హనుమంతరాయప్ప, కరియణ్ణ, అంజనరెడ్డి, జయ శంకర రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత 'హిందూపురం'



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో మైదానం యూనైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో నెవర్ ఎండ్ గోలి సోడా ప్రతినిధుల సహకారంతో జిల్లా స్థాయి 7ఏ సైడ్ అండర్ -12 మిక్స్‌డ్ జెండర్, అండర్–13 బాలుర ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. అండర్–12 మిక్స్‌డ్ జెండర్ పోటీల్లో హిందూపురం యూనైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ విజేతగా నిలవగా, రెండవ స్థానంలో పూలమతి ఎఫ్‌సీ, మూడో స్థానంలో హిందూపురం టౌన్ ఎఫ్‌సీలు నిలిచాయి. అలాగే అండర్–13 బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో మడకశిర ఎఫ్‌సీ విజేతగా నిలవగా, పరిగి సౌత్ ఎఫ్‌సీ రెండవ స్థానంలో, గుత్తి ఆర్ఎస్ ఎఫ్‌సీ మూడవ స్థానంలో నిలిచాయి. ఆర్‌డీటీ మేనేజర్ దాదా ఖలందర్, ఆర్‌డీటీ టెన్నిస్ కోఆర్డినేటర్ విశాల్‌కుమార్, నెవర్ ఎండ్ గోలీ సోడా డిస్ట్రిబ్యూటర్ విజయ్‌కుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు.

టీడీపీ సమావేశాన్ని అడ్డుకుంటాం

మడకశిర: మడకశిరలో ఈనెల 28న తలపెట్టిన టీడీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని అడ్డుకుంటామని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. మాదిగ వర్గానికి చెందిన మడకశిర మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ ఈరన్నను కించపరచడానికి నిర్వహిస్తున్న విస్తృతస్థాయి సమావేశాన్ని అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు.

పరిగిలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన

పరిగి: ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆదివారం పరిగి మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత శ్రీరంగరాజుపల్లి ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు సోదరుడు రమేష్ గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. పరిగి బీరప్ప ఆలయ కళ్యాణ మంటపంలో జరిగిన శశాంక్, చైత్ర వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఊటుకూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు గంగాధర్ సోదరి వివాహ వేడుకలో పాల్గొన్నారు. యర్రగుంటలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చాంద్‌బాషాను పరామర్శించారు. ఇంటి నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, మండల నాయకులు నరసింహారెడ్డి, కిరణ్, సర్పంచ్‌లు దిలీప్‌యాదవ్, బాలకృష్ణ, మాజీ కన్వీనర్ జయరాం, నాయకులు శివ, రఫీక్, ఎంపీటీసీలు చిక్కన్న, మారుతీరెడ్డి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి రథోత్సవం



మడకశిర: గుడిబండ మండలంలోని హిరేతుర్పిలో ఆంజనేయస్వామి బహ్మరథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం నుంచే ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి, తిప్పమ్మస్వామి ఆధ్వర్యంలో స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల జయధ్వానాల మధ్య భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని నిర్వహించారు. స్థానికులతో పాటు దాసరపల్లి, హెచ్ గొల్లహట్టి, శింగేపల్లి, కేఎస్‌పల్లి, చిగతుర్పి, కరికెర తదితర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి

హిందూపురం: ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలి. విద్యతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవామని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. ఆదివారం హిందూపురం మండలంలోని చౌళూరులోని సరస్వతీ మందిరం 29వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి సరస్వతీ పూజ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు సుజాత, త్రివేణి, ఎంపీపీ రత్నమ్మ సర్పంచ్ నంజప్ప, ఎంపీటీసీ కృష్ణవేణి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ సంప్రోక్షణ



బయలు ఆంజనేయస్వామి మూలవిరాట్

రొద్దం: మండల పరిధిలోని ఎల్‌జీబీ నగర్ సమీపంలో పెనుకొండ–పేరూరు ప్రధాన రహదారి పక్కన నూతనంగా నిర్మించిన ఆలయంలో బయలు ఆంజనేయస్వామి విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. మొదటిరోజు యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, తదితర పూలు చేశారు. సోమ, మంగళ, బుధవారాల్లో ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. గురువారం తెల్లవారు జామున మహా కుంభం సంప్రోక్షణ, ధ్వజస్తంభ, నాగశిలా, శిఖర కలశ ప్రతిష్ట మహోత్సం ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసులు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిలమత్తూరు: మండలంలోని టేకులోడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జయచంద్రారెడ్డి శనివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ ఆదివారం టేకులోడులో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ మద్దిపి లక్ష్మీనారాయణ, నవీన్, భాస్కర్‌రెడ్డి, చౌడప్ప, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

పెనుకొండ రూరల్: పెనుకొండ జాతీయ రహదారి హరిపురం వై జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు గాయపడ్డారు. స్థానికుల వివరాలమేరకు.. హరిపురం గ్రామానికి చెందిన నాగరాజు పెనుకొండ నుంచి తిరిగి వెళ్తుండగా హరిపురం వైజంక్షన్ సమీపంలో ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగరాజు గాయపడగా 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



మడకశిరలో ర్యాలీ నిర్వహిస్తున్న బంజారాలు

మడకశిర: పట్టణంలో ఆదివారం సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని 5 మండలాలకు చెందిన బంజారాలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ట్రాక్టర్‌లో సేవాలాల్ చిత్ర పటాన్ని ఉంచి ఊరేగింపు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో పరికరాల చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సోమందేపల్లి: మండలంలోని మేకలపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న పరికరాలు చోరీకు గురైనట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజీవప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుండగులు శనివారం రాత్రి విద్యుత్ కనెక్షన్ తొలగించి 30 కేజీల కాపర్ వైర్లు, 70 లీటర్ల ఆయిల్ చోరీ చేశారన్నారు. ఎస్ఐ విజయ్ కుమార్ గ్రామంలో విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



అగళి: నాటి గురువులతో పూర్వ విద్యార్థులు



గుడిబండ: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మడకశిర(అగళి): అగళి మండలంలోని మధూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వపు విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. 1987–88వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారంతా సమ్మేళనంలో పాల్గొన్నారు. దాదాపు 35 సంవత్సరాల తర్వాత ఒకచోటికి చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఒకరి కష్టాలను ఒకరు తెలుసుకుంటూ సంతోషంగా గడిపారు.

గుడిబండ: మండల పరిధిలోని మండలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–2005 సంవత్సరంలో 10వ తరగతి చదివిన వారంతా ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు.